
నినాదం
నిఖార్సైన జర్నలిజం
ఆదివారం, ఫిబ్రవరి 15 , 2026

# సాహితీ లహరి

# సమకాలీన సద్గురు దర్శనం...
# మాన్యవర్య శతకం

**గురువు లందున బంజార గుర్తు యతడు /ధర్మ మన్నను గిరిజన ధర్మమతడు/స్ఫూర్తి దాతగా నిలిపిన సూర్యకిరణ/మహిత సద్గురు పూజారి! మాన్యవర్య!..**




సాధారణంగా విశ్వవిద్యాలయంలో పనిచేసేవారు పాఠాలు చెప్పడం, వ్యాసాలు రాయడం అనివార్యం. అయితే, సృజనాత్మక సాహిత్యాన్ని కూడా రాస్తుంటే, ఆ ఆచార్యుల కృషిని విశేషంగా చెప్పుకోవాలి. శాస్త్రాల్ని పాఠాలుగా చెప్పేవారు నూటికో కోటికో తప్ప, సంప్రదాయ, ఆధునిక సాహిత్యం, కవిత్వం చెప్పేవాళ్ళు విశ్వవిద్యాలయ ఆచార్యులు అయినప్పటికీ సృజన సాహిత్యాన్ని కూడా రాస్తుంటారు. ఆచార్య గోనా నాయక్ గారు జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు వివిధ స్థాయిలలో పాఠాలు బోధించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కొన్నాళ్ళు పనిచేసి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆచార్యుడిగా చేరారు. అంతకుముందు ఆయన నాకు తెలిసినప్పటికీ, యూనివర్సిటీలో చేరిన దగ్గర నుండి ఆయనను దగ్గరగా గమనిస్తున్నాను. ఆత్మీయత ఆయనకున్న గొప్ప ఆభరణం. విద్యార్థులను దగ్గరగా తీసుకుంటారు. వయసులో తనకంటే పెద్దవాళ్ళయినా, చిన్నవాళ్ళయినా వారిని సముచితంగా గౌరవించే గొప్ప సంస్కారం ఉన్న వ్యక్తిత్వం ఆయనది. తనకు ఇద్దరూ ఆడపిల్లలే కావడం వల్లనో ఏమిటో ఆయనలో ఎంతో ఆత్మీయత కనిపిస్తుంటుంది. తాను పెరిగిన వాతావరణం వల్లన ఏమిటో తొందరపడి ఎవరిని ఏ మాట అనడు. ఆయనకు మంచి గురువులు లభించడం వల్లనో ఏమిటో వినయం–కృతజ్ఞత తన రెండు చేతుల్లా తోడ్పడుతుంటాయి. సమస్య ఎంతటి క్లిష్టమైనదైనా దాన్ని సులభంగా పరిష్కరించుకోవడమెలాగో ఆయన నుండి మనం నేర్చుకోవాల్సిన లౌక్యం. ఇవన్నీ అంటే ఆయన వ్యక్తిత్వం, ఇతరులను తాను చూసే పద్ధతీ, దగ్గరకు తీసుకొనే విధానం వంటివన్నీ ఇటీవల తాను వర్ణించిన 'పూజారి మాన్యవర్య శతకం'లో చూడొచ్చు.

కీర్తిశేషులు పూజారి రంజిత్ నాయక్ మహారాష్ట్రలో ఒక ఆర్కిటిక్ ఇంజనీర్. తన పిల్లలకు మంచి విద్యాభ్యాసం, దాని వల్ల మంచి జీవితాన్నెలా జీవించడం నేర్పి, తన ఆస్తులలో అత్యధిక భాగాన్ని తన పిల్లలకు ఇవ్వడం కంటే, తన జాతిని చైతన్యపరిచే ఒక ట్రస్టుకు రాసిచ్చారట. మొదటి నుండీ సామాజిక సేవాభావం కలిగిన పూజారి రంజిత్ నాయక్ అనేక మందికి ఉదారంగా ఆర్థిక సహాయం కూడా చేసేవారని ఆచార్య ఎం.గోనానాయక్ చెప్తుంటారు. ఆయన పిహెచ్.డి. పరిశోధన చేసేటప్పుడు క్షేత్ర పర్యటనలో భాగంగా తన గురువు ఆచార్య హెచ్.ఎస్.బ్రహ్మానంద గారితో పాటు పూజారి రంజిత్ నాయక్ గార్ని కలిశారట. రంజిత్ నాయక్ గారు ఆ రోజుల్లోనే వందరూపాయల నోట్ల కట్ట తీసి లెక్కపెట్టకుండానే కొంత డబ్బుని తీసి, పరిశోధనకు వాడుకోమన్నారట. అవి తాను లెక్క పెడితే పదిహేను వందల రూపాయలు ఉన్నాయనీ ఆచార్య గోనానాయక్ గారే నాకు స్వయంగా చెప్పారు. ఆ డబ్బులతో పాటు శ్రీ రంజిత్ నాయక్ గారు హైదరాబాద్ వచ్చినప్పుడల్లా రెండేసి వేల రూపాయలు ఇచ్చేవారనీ, దానితో అనంతపురం పరిసర ప్రాంతాల్లో తనతో పాటు మరికొంతమంది పరిశోధకులు కలిసి సేవాలాల్ మహారాజ్ జీవించిన చారిత్రక ఆధారాలు సేకరించగలిగామని సగర్వంగా చెప్తుంటారు. తాను సంపాదించిన వందలాది ఎకరాలను సేవాలాల్ మహారాజ్ ట్రస్టు కి ఇచ్చేశారనీ,

***ఈ పద్యం 'పూజారి మాన్యవర్య శతకం' లోనిది. కృతి కర్త ఆచార్య ఎం.గోనా నాయక్ గారు. కవి పూజారి రంజిత్ నాయక్ను బంజార సమాజపు ధర్మ చైతన్యానికి ప్రతీకగా నిలిచిన గురువుగా దీనిలో అభివర్ణించారు. "గురువు లందున బంజార గుర్తు" అని ఆయన బోధనల్లో బంజార సంస్కృతి, ఆచారాలు, విలువలు స్పష్టంగా ప్రతిఫలిస్తున్నాయని ప్లకటిస్తున్నారు. పూజారి నాయక్ గారు చెప్పే ధర్మం పుస్తకాల నుండి పుట్టింది కాదు; అది గిరిజనుల జీవనానుభవం నుడి ఆవిర్భవించిన జీవన విధానంగా మారిన ధర్మం. అందుకే ఆయన స్ఫూర్తి దాతగా నిలిపిన సూర్యకిరణం, చీకటిలో దారి చూపే కాంతి, నిస్సహాయతలో ఆశను నింపే శక్తిగా కవి కీర్తిస్తున్నారు. అంతే కాదు, "మహిత సద్గురు పూజారి! మాన్యవర్య!" అనే సంబోధన మకుటం పెట్టడం ద్వారా కవి ఆయనను గొప్ప ఆధ్యాత్మిక గురువుగా, గిరిజన సమాజాన్ని జాగృతం చేసిన ధర్మనాయకుడిగా భావించాలని ప్రబోధిస్తున్నారు.ఈ శతక కర్త సహృదయ సాహితీవేత్త ఆచార్య ఎం. గోనా నాయక్ గారు వివిధ ప్రక్రియల్లో రచనలు చేస్తున్నారు.***

ఆయన గిరిజనుల సాంస్కృతిక వికాసానికి ఎంతగానో తోడ్పడ్డారనీ, ఆ కృతజ్ఞతతోనే ఈ 'పూజారి మాన్యవర్య శతకం' రాయాలని సంకల్పించానని చెప్పారు.

ఒక్కో వంశం (కులం) లో ఒక్కో మహానుభావుడు జన్మిస్తాడు. ఆయన ఆ వంశాన్ని సర్వతోముఖాభివృద్ధిలో పయనించడానికీ, అనేక జీవన విలువలు, నియమాలు, సూత్రాలు, సిద్ధాంతాలను ప్రతిపాదిస్తారు. వాటిని పాటించడం ద్వారా ఆ వంశాలలో కొత్త చైతన్యం వస్తుంది. అటువంటి మహానుభావుల చరిత్రలను ఇలా తమదైన రీతిలో మరొక్కసారి ప్రజలకు గుర్తుచేయడం ద్వారా మనుషుల మధ్య సత్సంబంధాలు పెరుగుతుంటాయి. మంచి చేయాలనే భావన విస్తృతంగా వ్యాపిస్తుంది. ఆ లక్ష్యంలో భాగంగానే ఆచార్య గోనానాయక్ గారు ఈ శతకాన్ని రచించారు. దీనిలోని కొన్ని పద్యాలను రుచి చూద్దాం.

***''మలయ మారుత గాలులు పిలిచినట్లు***
***జ్ఞాన మందించు నీ సేవ భాగ్య రాశి***
***తరము తరమును తపముగ తలుచునట్లు***
***మహిత సద్గురు పూజారి! మాన్యవర్య!''***

ఈ పద్యంలో కవి ఆచార్య ఎం. గోవా నాయక్ గారు పూజారి రంజిత్ నాయక్ను తరతరాలకు జ్ఞానాన్ని మోసుకొచ్చే మహా సేవామూర్తిగా ఆవిష్కరిస్తారు. "మలయ మారుత గాలులు పిలిచినట్లు" అనే ఉపమానం ద్వారా ఆయన సేవలోని సహజత్వం, పవిత్రత, ఆహ్వానాత్మక స్వభావం వ్యక్తమవుతుంది. జ్ఞానం ఆయన వద్ద నిలిచిపోయే వస్తువు కాదు; అది ప్రవహిస్తూ సమాజాన్ని తాకే శక్తి. "నీ సేవ భాగ్య రాశి" అని ఆయన సేవను సమాజానికి లభించిన అదృష్టంగా కవి నిర్దిష్టం చేస్తారు. ఇక్కడ సేవే తపస్సుగా, తపస్సే జీవన విధానంగా మారిన ఒక సద్గురు రూపం దర్శనమిస్తుంది. పూజారి రంజిత్ నాయక్ స్థాపించిన సేవాలాల్ మహారాజ్ ట్రస్టు ప్రస్తావన ద్వారా ఆయన సేవకు సామాజిక దిశ స్పష్టమవుతుంది. గిరిజనులలో ఆత్మవిశ్వాసాన్ని నాటడంతో పాటు, వారికి ఒక గుర్తింపును, గౌరవాన్ని, స్వయంసామర్థ్యాన్ని తిరిగి ఇచ్చే సాంస్కృతిక పునర్నిర్మాణ ఉద్యమం. అందుకే కవి ఆయనను "మహిత సద్గురు పూజారి! మాన్యవర్య!" అని సంబోధిస్తారు. ఇది ఒక ఉద్యమ నాయకునికి ఇచ్చిన గౌరవ ముద్ర. ఈ పద్యం ద్వారా పూజారి రంజిత్ నాయక్ వ్యక్తిత్వం, సేవ, దృష్టి అన్నీ కలిసి గిరిజన సమాజానికి వెలుగుదీపంగా నిలిచిన మహానుభావుడి ప్రతిమను మనందరి ముందు నిలుపుతారు కవి.

శ్రామికులు నిత్యం కఠినమైన శారీరక శ్రమ చేయడం వల్ల బలమైన ఆహారం తీసుకోవాలి. అందువల్ల మాంసాహారం తమ ఆహారంలో భాగమవుతుంది. దానితో పాట శారీరక శ్రమ మరిచిపోవడానికి మత్తపానీయాలను కూడా అలవాటు చేసుకుంటారు. క్రమేపీ అవి వారిని ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా కుంగదీసేస్తాయి. పనిచేసినా చేయకపోయినా తాగుడు అలవాటు మానలేకపోతారు. అందువల్ల వారు సమాజంలో ఏ రంగంలోనూ అభివృద్ధి సాధించలేకపోతుంటారు. దీన్ని గమనించిన మహానుభావులు ఎంతోమంది మద్యాన్ని మానేయమని ప్రబోధించారు. వారిలో పూజారి రంజిత్ నాయక్ ఒకరు. తన గిరిజన సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే తమ వాట్లలో మార్పులు చేసుకోవాలని సూచించారు. వీటిని వర్ణిస్తూ కవి...

***''మత్తు వదిలిన కలుగును మమత సిరులు***
***హింస వదిలిన కలుగును హితము జగము***
***సంతు భావాలు చాటిన సాధు శక్తి***
***మహిత సద్గురు పూజారి! మాన్యవర్య!''***

అనే పద్యంలో చక్కగా వర్ణించారు. ఈ పద్యంలో కవి పూజారి రంజిత్ నాయక్ గారి బోధనలు సామాజిక మార్పుకి శక్తివంతమైన సాధనాలుగా స్పష్టంగా ఆవిష్కరిస్తాడు. మత్తునీ వదిలేయాలనడం ద్వారా మద్యపానం మంచిది కాదనే బోధనను తెలుపుతుంది. అంతేకాకుండా మద్యాన్ని వదిలేస్తే 'కలుగును మమత సిరులు' అని చెప్పి, కుటుంబానికీ, సమాజానికీ ప్రేమ, ఆప్యాయతలు తిరిగి వస్తాయని సూచిస్తారు. అలాగే అహింసే సామాజిక సంక్షేమానికి మూలమని చాటుతున్నారు. ఈ రెండింటినీ సాధనగా మలిచిన సాధు శక్తిగా పూజారి రంజిత్ నాయక్ దర్శనమిస్తారనడం ఆయనపట్ల కవి వ్యక్తపరిచిన గౌరవ భావం తెలుస్తుంది. రంజిత్ నాయక్ గారి ఉపదేశాలు గిరిజన సమాజంలో సద్భావాలను మేల్కొలిపే జీవన మార్గదర్శకాలుగా సూచించారు కవి. ఆయన బోధనలు ఎన్నో ఉన్నాయి. వాటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని గిరిజనులందరికీ ఆయనను స్ఫూర్తి ప్రదాతగా తీసుకోవాలంటూ జ్ఞాన ప్రదాతగా కూడా అభివర్ణించారు.

***''రామ పాదము సోకిన రాయియైన***
***నాతి రూపంబు దాల్చెను. నాటి కథల***
***సంతు పాదాల చెంతన సాధుడయ్యె***
***మహిత సద్గురు పూజారి! మాన్యవర్య!''***

పూజారి రంజిత్ నాయక్ గారి ఆత్మపరివర్తన శక్తిని రామాయణంలోని రాయి రాముని పాదం తగలగానే అహల్యగా మారినట్లు చెప్పే ఉపమానంతో సౌందర్యంగా అనుసంధానిస్తాడు. "రామ పాదము సోకిన రాయియైన నాతి రూపంబు దాల్చెను" అన్నది దివ్యస్పర్శ వల్ల జడత్వం చైతన్యంగా మారినట్లు, పూజారి గారి స్పర్శతో జీవితాలు మారుతున్నాయని సూచిస్తుంది. అలాగే "నాటి కథల సంతు పాదాల చెంతన సాధుడయ్యె" అన్న వాక్యం సంప్రదాయ కథలలోని సద్గుణాలను ఆశ్రయించి, ఆధ్యాత్మిక సాధన ద్వారా ఆయన సాధుత్వాన్ని సంతరించుకున్నాడని తెలియజేస్తుంది. ఇలా కవి ఆయనను మార్పుకు మార్గదర్శకుడిగా, పాత విలువలను కొత్త చైతన్యంగా మలిచిన మహానుభావుడిగా దర్శింపజేస్తూ "మహిత సద్గురు పూజారి! మాన్యవర్య!" అని ఘనంగా ప్రశంసిస్తారు.

మొత్తం మీద 'మాన్యవర్య శతకం' ఆధునిక కాలంలో సద్గురుత్వానికి, సేవాభావానికి అక్షర రూపం. పూజారి రంజిత్ నాయక్ జీవితం, వ్యక్తిగత సాధనతో మొదలై సామాజిక మార్పుగా విస్తరించిన ఒక సజీవ యాత్ర. గిరిజన సమాజంలో ఆత్మవిశ్వాసాన్ని నాటిన సేవాలాల్ మహారాజ్ ట్రస్టు వంటి కార్యాచరణలు ఈ శతకానికి నేపథ్యంగా నిలిచాయి. ఈ శతకంలోని ప్రతి పద్యం ఒక అనుభవంలా అనిపిస్తుంది.

కవి ఆచార్య ఎం. గోవా నాయక్ గారు ఈ శతకంలో భక్తి, సామాజిక, నైతికతలను ఏక ధారగా మలిచారు. మత్తు విముక్తి, అహింస, మమత, ధర్మచైతన్యం వంటి విలువలు జీవన విధానాలుగా ప్రతిఫలిస్తాయి. ఉపమానాల సౌందర్యం, సంబోధనల గౌరవం, భాషలోని తేటతనం... ఇవన్నీ కలిసి పూజారి రంజిత్ నాయక్ గారిని సమకాలీన సమాజానికి దిశానిర్దేశకుడిగా నిలబెడతాయి. 'మాన్యవర్య శతకం' చదివే ప్రతి పాఠకుడికి ఇది ఆత్మపరిశీలనకు ఆహ్వానం. సేవను తపస్సుగా, ధర్మాన్ని జీవన సత్యంగా గ్రహించే బుద్ధిని పెంపొందిస్తుంది. గిరిజన సంస్కృతి గౌరవంతో నిలబడే ఈ శతకం, కాలాన్ని దాటే విలువలతో, తరతరాలకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షిస్తూ, కృతికర్త ఆచార్య ఎం.గోనానాయక్ గారికి శుభాకాంక్షలు తెలుపుతున్నాను.



ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు,
పూర్వ అధ్యక్షులు, తెలుగు శాఖ,
స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్,
యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్,

## అక్షరజ్యోతి...

పలక, బలపాన్ని విడిచి,
పుస్తకాన్ని అందుకుంటున్న
పసివయసులో, పసిమనసుకి
ఎదురైనా చిక్కు ప్రశ్న
పెద్దయ్యాక ఏమౌతావురా?
గవర్నమెంట్ నౌకరు చెయ్యాలె...
పుస్తకాల సంచిని వీపు మీద మోస్తుంటే,
ఏదో పెద్ద నౌకరే చేసేతట్టున్నావులే
అన్న దీవెనలు..
బలంగా మారుతున్న ఆశయం
తరగతులు పెరుగుతున్నా,
పుస్తకాలు మారుతున్నా,
అడిగే ప్రశ్న మాత్రం మారలే,
ఒక్క పసిమనసుతోనే ఆగలే,
పంతం వీడక, పట్టుదలని వదలక
కళ్ళలో వత్తులేసుకొని
అహర్నిశలు ఆశజ్యోతిని వెలిగించి
పుస్తక పుటల్లోకి ప్రయాణం చేస్తూ
అర్ధరాత్రిలో కూడా పేజీలు
తిప్పినా నిశాచరులెందరో...
కలలు కన్న స్థానం కోసం,
కాలంతో పోటీపడుతూ,
కలంతో యుద్ధం చేస్తూ,
పరీక్షలకి అప్రమత్తం అవుతూ,
పై చదువు కోసం పైసా లేకపోతే
ఎన్నో పాట్లుపడి, పస్తులుండి
ఏదో ఒక పనిచేసి చదువుకుంటున్న
పోరులెందరో.....
చితికిన బతుకులతో చేసిన పోరాటలెన్నో
పచ్చని మెతుకులు గతిలేకపోతే
గుక్కెడు నీళ్లతో గొంతులు
తడుపుకున్న కుత్తుకలెన్నో...
పుస్తకాలు కొనడం కోసం,
అటకలు వెతికిన అరచేతులెన్నో
జ్ఞానంతోనే తమ దరిద్రాన్ని
తరిమికొట్టాలనుకున్న దృఢసంకల్పులెందరో..
ఆటంకాల్ని ఎదుర్కొంటూ గురిచూసి
బాణాన్ని ఎక్కుపెట్టిన అర్జునులెందరో..
ద్రోణచార్యుడి శిక్షణలో
విలువిద్యల్ని నేర్చుకున్న ఏకలవ్యులెందరో..
ఎంత కృషి చేసినా
ఎండమావిలో నీరులాగా అవకాశాలు
చాపకింద నీరులా అవకాశవాదులు
అంది, అందకుండా ఊరించే కొలువులు
నెలువులేక నెరిసిన తలలతో
మెరిసిన ముత్యాలెన్నో..
అయినా ఉడుంపట్టులాంటి పట్టుదల
చివరకు ఆశజ్యోతి, అక్షరజ్యోతై
చిక్కుపడ్డ చిక్కు ప్రశ్నల
చిక్కుముడులను విప్పింది..
అయిదు వేళ్ళ అరచేతికి,
ఆరో వేలు కూడా తోడైంది...



తాడూరి సమత
హైదరాబాద్ విశ్వవిద్యాలయం

# ప్రాచీన శిల్పకళకు ప్రతిరూపం ధర్మపురి శివాలయం

భారత దేశ ప్రాచీన సంస్కృతీ సభ్యతలకు నిలయంగా సనాతన సాంప్రదాయాలకు పుట్టినిల్లుగా, వేదవేదాంగ శాస్త్రాగమ, నృత్య గీత నాట్యాది సకల కళలయందు నిష్ణాతులైన ధార్మిక కార్యాదరణాసక్తులైన ప్రజానీకంతో, మరెచ్చటా కానరానన్ని ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్న పలు దేవాలయాల సముదాయం కలిగి, రాష్ట్రంలో సుప్రసిద్ధ ప్రాచీన పవిత్ర గోదావరి తీరస్థ తీర్థంగా, పుణ్య క్షేత్రంగా మిగుల ప్రాచుర్యం పొందింది నాటి అవిభక్త కరీంనగర్, నేటి నూతన జగిత్యాల జిల్లాలోని ధర్మపురి క్షేత్రం. శ్రీలక్ష్మీనరసింహ, శ్రీరామలింగేశ్వరస్వాముల దేవాలయాలు, మసీదూ పక్కపక్కనే కలిగి అనాదిగా వైష్ణవ, శైవ, ముస్లిం మత సామరస్యానికి సాక్ష్మీభూతంగా నిలిచియుంచీ క్షేత్రరాజం. గంభీర గౌతమీనది తీరాన వెలసి, అలనాటి శిల్పకళా చాతుర్యానికి ప్రతిబింబమై పౌరాణిక ఐతిహాసిక, చారిత్రిక ప్రాధాన్యతను సంతరించుకుని దక్షిణ కాశిగా పేరెన్నిక గనుటకు మూలకారణమైనది ఈ క్షేత్రంలోని శ్రీరామచంద్ర స్థాపిత శ్రీరామలింగేశ్వరాలయం. భృగు మహర్షి త్రిమూర్తులను పరీక్షించిన నేపథ్యంలో, కైలాస మేగిన సందర్భంలో, నిత్యానందంలో మునిగి తేలుతూ, ఆ మహర్షి రాకను గమనింపని పార్వతీ పరమేశ్వరులను గాంచిన భృగు మహర్షి, శివుడు లింగరూపులో ఉంటూ, ఎవరిచేత పూజింపబడకుండునట్లు శాపమిచ్చెనని పురాణాలు విశదీకరిస్తున్నాయి.

తన శాప విముక్తి పరమ శివుడు, మహా విష్ణువును గురించి ఘోర తపస్సు చేయగా రామావతారంలో, ధర్మపురి క్షేత్రంలో స్వయంగా తాను లింగాన్ని ప్రతిష్టించి, పూజించి శాప నిమోచనం కలిగించ గలనని మహా విష్ణువు వరమిచ్చినట్లు స్థానిక పురాణాలు స్పష్ట పరుస్తున్నాయి. రామావతారంలో దశరథుని ఆజ్ఞానుసారం వనవాస దీక్షలో, దండకారణ్యంలో సంచరిస్తూ, ధర్మపురి క్షేత్రానికి ఏతెంచిన శ్రీరాముడు అలనాటికే వెలసి యున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఈశాన్యాన, సైకత (జసుల) లింగాన్ని ప్రతిష్ఠ చేసినట్లు, శ్రీరామునిచే స్థాపించ బడినందున శ్రీరామలింగేశ్వరుడని నామాండితుడై నట్లు స్థల పురాణం స్పష్టం చేస్తున్నది. ఆరవ శతాబ్దంలో స్థాపించబడి, ఎనిమిదవ శతాబ్దాంతం వరకూ వర్ధిల్లిన చాళుక్య రాజుల ప్రాభవంలో పునర్మించ బడిన రామేశ్వరాలయంలోని గణేశ విగ్రహములు అలనాటి శిల్పకళకు అద్దం పడుతున్నాయి. క్రీ.శ.973 నుండి 1140 వరకు పాలించిన కల్యాం చాళుక్యుల వంశానికి చెందిన విక్రమార్క బిరుదాంకితుడుగు ఆరవ విక్రముని (1076–1126) నాటి శిలాశాసనం ఈ ఆలయంలో ఉంది. ఇందులో ఈ చాళుక్యరాజు పరమేశ్వర, రణ రంగభైరవ, మార్వల భైరవ, ఆయత గంధ వారణ, విక్రమాదిత్య బిరుదులతో ప్రశంసింప బడినాడు. శాలివాహన శకం 1168 పరాభవ నామ సంవత్సర కాలం నాటి కాకతి గణపతి దేవుని శిలాశాసనం రామేశ్వరాలయంలో పూర్వపు చాళుక్య స్థంభం పైనే చెక్కబడి ఉంది.

గణపతి దేవుడు ఇచటి రామేశ్వర, చండికల అంగరంగ వైభోగములకు గావించిన కొన్ని దానములు శాసనములలో పేర్కొనబడినవి. చాళుక్య శైలిలో బొజ్జ ఎత్తుగా నుండి, సహజమైన ఏనుగు తలను కలిగి, మానవ రూపంలేని గణపతి విగ్రహం ఆలయ సముదాయంలో నుంది. శివాలయ శిఖర నిర్మాణంలో చాళుక్య శైలి ఉంది. శిఖరం చాపాకృతిని పోలి. కిందనుండి పైకి ఎక్కుపెట్టిన విల్లులా ఉంది. శిఖర సౌందర్యానికి పైన ఆమలకములు వృత్తకారంలో చుట్టూరా కలిగి, ఆంతకుపైన కలశం, తూర్పున శుక నాసం ఉన్నాయి. శుక నాసం చిలుక ముక్కు లాగ ముందుకు పొడుచుకు వచ్చిన గూడు, శిఖర నిర్మాణం ఉత్కళ శైలిలో, లింగరాజ స్వామి ఆలయం (భువనేశ్వర్) దేవాలయ శఖరాకృతిని పోలి ఉంది. ప్రవేశ మంటపం తర్వాత దూరంగా గర్భాలయంలో మొదట ముఖ మంటపం ఉంది. మధ్యన గల రంగ శిల ప్రాచీనంగా నర్తకీమణుల వేదిక, నేడు అది వల్ల బండ.తర్వాత చీకటిగా.నుండే అంత రాళం, అపైన గర్భ గృహం. అందు శ్రీరామచంద్ర స్థాపిత సైకత (జముక) లింగం, ముఖ మంటపము, ప్రవేశ మంటపము, గర్భ గృహములు, ఆలయ ప్రాంగణంలో దాటితే శివుని దర్శనం. అలయ ప్రాంగణంలో మూడు ద్వారాలకు ఆభిముఖంగా నల్లరాతితో నిర్మించిన ఆభరణాలు అధికంగా గల, పీఠంపై ఉబ్బెత్తు హారాలు గలిగి, కాకతీయ ఆల యాలలో వలె శిలాకృతులు, జిలుగు నగిశీలు, మెడలో గంటలు, మువ్వల పట్టి, మెడ పట్టెడలు, గంగడోలు, వంపు తిరిగిన మెడ, వృషణాలతో నందులు ఉన్నాయి. పైకప్పుపై అపురూపాలైన ఏక ముఖ ద్వి దేహ నందులు నాలుగు మూలల ఉండేవి. సాలహార పునర్నిర్మాణ సమయంలో కూల్చి వేయడం జరిగింది. దేవాలయం కప్పుకన్నా ఎ త్తుగా, నిటారుగా 15అడుగుల ఎత్తు



ఉన్న ధ్వజ స్థంభం (విజయ స్థంభం) ఉంది. శివాలయ ఈశాన్య భాగాన గణపతికి ప్రత్యేక గుడి ఉంది. ఇది కూర్చొని ఉన్న భారీ విగ్రహం. చాళుక్యుల కాలం నాటి విగ్రహానికి కుడి చేతులో గద ఉంది, నాగభంధం కలదు .ఎడమ చేతిలో గండ్ర గొడ్డలి వంటి ఆయుధం, ఎడమ కింది చేతిలో మోదకాలు (ఉండ్రాళ్ళు) ఉన్నాయి. చెవులు చేటంత విశాలంగా ఉన్నాయి. రెండు వీర గల్లుల శిల్పాలున్నాయి. పదాతిదళపు వీరుడు శత్రువులను చీల్చి చెండాడు తున్న దృశ్యం, ప్రాంగణం బయట నాగిని విగ్రహముంది.

పైన నాగుల ఐదు పడగలతో కింద స్త్రీమూర్తి, చివర తోక, లేకుండా ఉంది. ఎనిమిది చేతుల మహిషాసుర మర్ధిని విగ్రహం ఉంది. అలాగే అపురూపాలైన బ్రాహ్మి, మాహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండ లేదా వరాహ పురాణంలో చెప్పబడిన యోగీశ్వరి ఆదిగా సప్త మాతృకల విగ్రహాలున్నాయి. ఒకే పీఠంపై చతురస్రాకార శిల్పమిది. ఇరు పార్శ్వా లలో గణపతి వీర భద్రుని విగ్రహాలు ఉన్నాయి. ప్రధాన దైవత లింగం కాక, ముఖ మంటపంలో వాయవ్యాన కాశీ విశ్వనాథుడు పేరుతో పూజలందుకునే 4 అడుగుల ఎత్తుగల లింగం ఉంది. దండకారణ్యంలో సంచరిస్తూ, ధర్మపురి గోదావరిలో స్నానమాచరించి, శివ పూజ చేసేందుకు, హనుమంతుని లింగం తెమ్మని కాశీకి పంపగా, ప్రతి ప్రతిష్టించే సమయానికి ఆంజనేయుడు రాని స్థితిలో, సైకత లింగ ప్రతిష్ట గావించారని, ఆలస్యంగా ఏతెంచిన హనుమ సేవలు వ్యర్థం కాకుండా, హనుమల్లింగాన్ని ప్రతిష్ఠ చేసి, ఆ లింగాన్ని పూజించాకే, గర్భాలయంలోకి వెళ్ళేలా నియమం శ్రీరాముడు ఏర్పరచారని స్థల పురాణం స్పష్ట పరుస్తున్నది. ఆలయంలో 13వ శతాబ్ధం కాలంనాటి చండిక విగ్రహం కలదు.

ఈ విగ్రహంలో అమ్మవారు చక్రస్తని, త్రిశూల, ఖడ్గహస్త, మకుట ధారిణి, చతుర్భుజ, శూల ధారిణిగా ఉంది. కాశీ విశ్వనాథుని పక్కన ప్రాచీన పార్వతీదేవి శిల్పం, మహిషాసుర మర్ధిని, షణ్ముఖుడు (కుమార స్వామి), ఉమా మహేశ్వరులు విడివిడిగా నల్ల శిలపై మలచబడి ఉన్నాయి. ఆలయంలో విక్రమాదిత్యుని, గణపతి దేవుని, ప్రధాన ద్వార కడప ముందర, బంకుళ్ళలో, దక్షిణ ప్రవేశ ద్వార స్థంభం, నైరుతి దిశలో ప్రహరీగోడ బాహ్యాది ఆరు శాస నాలున్నాయి. చుట్టూ రథం తిరిగేంత ప్రాంగణం, 10 అడుగుల ప్రహరీ కలిగి ఉన్నదీ ఆలయం. చారిత్రిక నేపథ్యం ప్రకారం, క్రీ.శ.1309లో ఢిల్లీ నేలిన అల్లాఉద్దీన్ ఖిల్జీ సేనాని మాలిక్ నాయబ్ కాపూర్, ఇందూరు (నిజామాబాద్ ) మీదుగా ధర్మపురి మార్గంలో కాకతీయుల పైకి దండెత్తి వెళ్ళిన సమయంలో క్షేత్రంలోని రామేశ్వర, నృసింహాలయాలు ధ్వంసం చేయబడినవి.

క్రీ.శ.1332–1367 మధ్యకాలంలో తెలంగాణా లోని వెలమ వీరుల సాయంతో, ముస్లింల నుండి దాస్య విముక్తి కలిగించిన ముసునూరి కాపయామాత్యుని పాలనా కాలంలో, పరమహంస పరి వ్రాజకాచార్య నారాయణాశ్రమ స్వామి ఉభయ దేవాలయాలకు చేయూతనిచ్చి తిరిగి అర్చనాదు లకై కట్టుదిట్టం చేశారు. అబుల్ హసన్ తానాషా(1674–1687) మంత్రియగు మాదోభానూజీ సూర్యప్రకాశ రావు మజుందార్ (మాదన్న మంత్రి) ఉభయ ఆలయాల అర్చనకు సహకరించారు. నాటినుండి స్థానిక దాతలైన విప్రవరుల, ఆర్యవైశ్యుల, భక్తుల సహకారంతో పూజా నైవేద్యాది విధివిదాన కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగిస్తూ, కొంతకాలం క్రితం దేవాలయం దేవాదాయ శాఖ ఆధీనంలోనికి తీసుకో బడింది. ఫలితంగా లక్ష్మీనరసింహ దేవస్థానంలో అంతర్భాగమైంది. వివిధ ధర్మకర్తల మండలుల కృషితో, దాతల చేయూ తతో నిధులను ప్రోగుచేసుకుని ముఖ్యమంత్రి సర్వశ్రేయో నిధి ద్వారా ప్రత్యేక నిధులు పొంది దేవాలయ పునరుద్ధరణ, సాలహార నిర్మాణం, అమ్మవారు, నంది, కలష, నవగ్రహ విగ్రహ ప్రతిష్టలు పూర్తి చేసుకుని , శృంగేరి శంకరాచార్య బహూకృత ఆదిశంకర, శారదామాత మూర్తులను ఆలయంలో ప్రతిష్టిం చడం జరిగింది.

శివరాత్రి, శివ కళ్యాణం, రథోత్సవం, గణపతి నవగ్రహ పూజలు, శంకర జయంతి, శరన్నవరాత్రుల ఉత్సవాలను, నరసింహ స్వామివారల బ్రహ్మోత్సవ వేడుకలలో అంతర్భాగంగా ఉత్సవాలను ఈ ఆలయంలో ఏడా సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఈఓ శ్రీనివాస్, జక్కు రవీందర్ నేతృత్వం లోని ధర్మ కర్తల మార్గదర్శకత్వంలో సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, అర్చకులు విశ్వనాథం, ప్రవీణ్ కుమార్, సిబ్బంది, ఏర్పాట్లు చేశారు.

రామ కిష్టయ్య సంగన భట్ల, 9440595494

## సాహిత్య రచనలకు ఆహ్వానం

ప్రతి ఆదివారం నినాదం పత్రిక సాహిత్య అనుబంధం తీసుకురావాలని అనుకుంటుంది. దీనిలో వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలు మొదలైన సాహితీ పరమైన రచనలను ఆహ్వానిస్తున్నాం. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్ కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064

నినాదం
నిఖార్సైన జర్నలిజం
ఆదివారం, ఫిబ్రవరి 15, 2026

# సాహితీ లహరి



# లంబాడీల ఆరాధ్య దైవం

## సంత్ శ్రీ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్

**లంబాడీల ఆరాధ్య దైవం సంత్ శ్రీ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్. ఈయన చిన్ననాటి నుండి జగదాంబ భక్తుడు. వీరికి దాదాపుగా 16వేల గోవులు ఉన్నట్లు కథలు చెప్పుకుంటారు. సేవాలాల్ మహారాజ్ నివసిస్తున్న గుత్తి ప్రాంతంలో ఒకసారి కరువు వచ్చింది. తన గోవులను రక్షించుకోవడం కోసం అక్కడినుండి కర్ణాటకలోని బళ్లారికి వెళ్లాడు. జగదాంబ సంకల్పం చేత బంజారాలను ఆపదలనుండి, కరువు నుండి వివిధ ఋగ్మతలు రాకుండా ఉండడం కోసం లంబాడీ జాతిని జాగృతం చేయడానికి పాటించవలసిన ధర్మాలను, పూజించవలసిన దేవతలను భారతదేశమంతా తిరిగి ప్రచారం చేశాడు. ఆయన ప్రతీ సందర్భంలో బంజారాలను ఉద్దేశిస్తూ నా చేత జగదాంబే ఈ మాటలు పలికిస్తుందని చెప్పేవారు. భారతదేశంలో ఉన్న బంజారాలందర్నీ ఏకత్రాటిపైకి తేవడానికి ప్రయత్నం చేశారు. అలాగే బంజారాలందరూ శాకాహారాన్ని మాత్రమే స్వీకరించాలనే ఒక ఉద్యమాన్ని కూడా తీసుకుని వచ్చిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహారాజ్. మాంసాహారంతో పాటు మందు, మత్తు పదార్థాలు తీసుకోరాదని బంజారా ప్రజలకు హితోపదేశం చేశారు. భారతదేశమంతా తిరుగుతున్న క్రమంలోనే మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతం, తెలంగాణా ప్రాంతాన్ని దర్శించారు. వివిధ ప్రాంతాలు దర్శించినపుడు ఇతనికి అనేకమంది శిష్యులు తయారైనారు. వారిలో బంజారా వ్యక్తులే కాకుండా బంజారేతరులు కూడా ఉన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ "తోటి మనుషులను గౌరవించండి, ప్రేమించండి" అని హితోపదేశం చేశారు. ప్రస్తుత సమాజంలో సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయాలను అనుసరిస్తూ ఈ సమాజాన్ని పునర్నిర్మించుకోవాల్సినటువంటి అవసరం ఎంతైన ఉంది.**

17, 18 శతాబ్దాల్లో జన్మించిన యుగపురుషులు భారతీయ ధర్మాన్ని రక్షించడానికి తమవంతుగా ప్రయత్నం చేశారని చెప్పవచ్చు. భక్త రామదాసు, పోతులూరి వీరబ్రహ్మంలాంటి యోగులు నివసించిన కాలంలోనే సంత్ సేవాలాల్ మహారాజ్ నివసించారు. ఆయన సమసమాజ నిర్మాణం కోసం పాటుపడి సనాతన ధర్మాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి కృషి చేశారు.

ఈ దేశంలో ఎందరో పుణ్యాత్ములు, యోగులు జన్మించారు. ఉత్తర భారతదేశంలో మీరాబాయి, కబీర్, తెలుగునాట అన్నమయ్య, రామదాసు, క్షేత్రయ్య వంటి ప్రముఖులు భక్తిని వాహికగా చేసుకుని భగవంతుని పట్ల తమ విశ్వాసాన్ని ప్రకటించుకున్నారు. సాక్షాత్తు శ్రీ వేంకటేశ్వర స్వామితో స్వయంగా పాచికలు ఆడిన హాతిరాం బావాజీ, సంత్ సేవాలాల్ మహారాజ్ గార్లు బంజారా జాతిలో జన్మించి జాతి జనులకు ఆరాధ్యులయ్యారు. లంబాడీ ప్రజలు ఏ గోత్రం వారైనా భవాని మాతను తప్పక పూజిస్తుంటారు. లంబాడీలు చెప్పుకునే పురాణ, ఇతిహాసాలలో సాత్ భవాని యాడిలున్నారు. వారే తౌళజా, మంత్రాళ్, సితళా, హింగళా, కాంకాళి, ధోళంగర్, దండి భవాని మాతలు.

సమాజంలో కాలానుగుణంగా మార్పులు జరిగాయి. భారతదేశాన్ని పరిపాలిస్తున్న బ్రిటిష్ వాళ్ళు, భారతదేశంలో రైళ్లు, బస్సులు మొదలైన వాహనాలు ప్రవేశపెట్టడంతో బంజారాల బిడారు రవాణా వ్యవస్థ చిన్నాభిన్నమై పోయింది. దీనితోపాటు మొదటి నుంచి హిందూ మతాన్ని అవలంబిస్తున్న బంజారాలపై పాశ్చాత్య సంస్కృతి రుద్దే ప్రయత్నం చేశారు. బంజారాలపై క్రైస్తవ మతంతో పాటు, తెలంగాణ ప్రాంతంలో ఇస్లాం మత ప్రభావం కూడా పడింది. ఇతర మతాల ప్రభావాన్ని వీరు భరించలేకపోయారు. వీరు ఆర్థికంగా కుంగిపోవడం కనిపిస్తుంది. ఈ సమస్యల నుండి బయటపడడానికి, తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి లంబాడా నాయకులు ఆలోచించి, లంబాడాలను చైతన్యపరిచేందుకు ప్రయత్నాలు చేశారు. నంగార, పితళేర్ థాళి (కంచు పళ్ళెం) మొదలైన వాయిద్యాలని చేతిలో పట్టుకొని బంజారాలందరు భక్తి శ్రద్ధలతో సాతీ భవానీలను పూజించడం మొదలుపెట్టారు. అలాగే ప్రస్తుతం లంబాడీ సమాజంలో నెలకొన్న దుస్థితిని పారదోలడానికి ఒక మహోన్నతమైన వ్యక్తి కావాలనే ఆకాంక్ష వారిలో బయలుదేరింది. లంబాడీల భవిష్యత్తు బాగుండాలనే దృఢ సంకల్పంతో సాతీభవాని మాత నుండి వరాలు పొందే ప్రయత్నం చేశారు.

లంబాడా జనుల పూజల ఫలితంగా భవానీ మాతలు మానవ రూపంలో ప్రత్యక్షమై మీ కోరిక నెరవేరుస్తామని మాట ఇచ్చి, లంబాడీ జనులతో తౌళజా భవాని వారిని ఉద్దేశిస్తూ "మేము ఏడుగురు అక్క చెల్లెల్లం, ఆరుగురు అక్క చెల్లెళ్లను ఆరాధించే భగత్తులు (భక్తులు) ఉన్నారు, కాని మా చిన్న చెల్లి అయిన దండికి భగత్ (భక్తుడు) లేడు. మా వరం మూలంగా పుట్టే వ్యక్తి తమ తల్లిదండ్రుల దగ్గర పన్నెండు సంవత్సరాలు మాత్రమే ఉంటాడు. ఆ తరువాత మేరామ మాత భక్తునిగా, ఆమె సేవలోనే ఉంటాడు" అని షరతు విధిస్తుంది.

అనంతపురం జిల్లా గుత్తి ప్రాంతంలో నివసిస్తున్న భీమానాయక్, ధర్మణి బాయి పుణ్య దంపతులు పన్నెండు సంవత్సరాల నుండి సంతానం లేక బాధపడుతున్నారు. భవాని మాత అనుగ్రహం వలన ధర్మణి బాయి కడుపులో దివ్యతేజస్సుతో 1739 ఫిబ్రవరి 15వ తేదీన ఒక బాలుడు జన్మించాడు.

ఆ దివ్య పురుషుడికి పేరు పెట్టడానికి తండా సమాజం నిర్ణయించుకున్నది. ప్రజల సేవకే జన్మించినందున ఇతణ్ణి 'సేవాదాస్' అని పిలిస్తే బాగుంటుందని నిర్ణయించి ఆ పేరు పెట్టారు. సేవాదాస్ పుట్టినప్పటి నుండి భీమ నాయక్ ఇంట్లో మేరామ మాత సకల సౌకర్యాలు కల్పిస్తూ ఉండేదట. సేవాదాస్ ఆరో సంవత్సరం నుండే తమ ఆవులను మేపడానికి చుట్టుపక్కల ఉన్న అడవిలోకి తోలుకొని పోయేవాడు.

ఆరు సంవత్సరాల బాలుడైన సేవాదాస్ తలకు రుమాలు చుట్టి, చేతిలో కర్ర పట్టుకొని, సద్ది మూట తీసుకొని ఆవుల మందను తోలుకొని అడవికి మేపడానికి పోయేవాడు. ఆ అడవిలో భయంకరమైన క్రూర మృగాలు ఉండేవి. అడవి మధ్యలో ఏడు మర్రి చెట్లు ఉండేవట. ఆ ప్రదేశం ఎవరికి తెలియదు. అలాంటి ప్రదేశంలోకి మేరామ సేవాదాస్ కి సకల విద్యలు నేర్పుటకు సన్నతమవుతుంది. చుట్టూ అడవి మధ్యలో విశాలమైన సుందర ప్రదేశం. ఆ ప్రదేశంలో మర్రి చెట్లు ఆ ప్రదేశంలో తుమ్మెదల సంగీతం, పక్కనే ప్రవహిస్తున్న సెలయేర్ల ధ్వనులు, కోకిల రాగాలు, పురివిప్పి నాట్యమాడే నెమళ్ళు ఇవన్నీ చూసి సేవాదాస్ సంతోషంతో పులకించిపోయేవాడట. ఈ ప్రదేశంలోనే మేరామ సేవాదాస్ కు అన్ని విద్యలు నేర్పించి, సకల శాస్త్రాలు బోధించి, మహా శక్తివంతుడుగా, ఒక మహాజ్ఞానిగా, మంచి పండితునిగా అతణ్ణి తీర్చిదిద్దింది. ఇతని ద్వారానే లంబాడీల సమసమాజ పునర్నిర్మాణం జరిగే విధంగా తయారు చేస్తుంది. సనాతన ధర్మశాస్త్రాలన్నింటినీ సేవాదాస్ తన పదకొండు సంవత్సరాల వయసు పూర్తి అయ్యేటప్పటికీ నేర్చుకున్నాడు. లంబాడీల ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకున్న మేరామ మాత వీరి వ్యాపారాలు కుంటు పడకూడదని సాత్ ఖాడు (ఏడు పశువుల మంద)ను దానం చేసిందట. వీటివలన లంబాడీల ఆర్థిక పరిస్థితి మెరుగుపడి, వారు వ్యాపారం చేసుకుంటారని తెలియజేసింది.

సేవాదాస్ మూగజీవాలను ఎక్కువగా ప్రేమించేవాడు పెద్దలపట్ల భయభక్తులు కలిగి ఉండేవాడు. పిల్లలను ఆదరించి విద్య నేర్పించే వాడు. తన చుట్టుపక్కల ప్రదేశాలు అన్నింటిని గుర్రం మీద తిరిగేవాడు. చిన్న వయసులోనే తను నివసిస్తున్న ప్రాంతంలో ఎవరికైనా ఏ ఆపద వచ్చినా మాత యొక్క అనుగ్రహంతో కష్టాలన్నీ తొలగించేవాడు. అందరి కష్టాలు తొలగిస్తూ ఉండటం వల్ల సేవాదాస్ ను భాయిగా పిలుస్తుండేవారు. భాయి అంటే అన్నా లేక తమ్ముడు అని అర్థం. అందుకే సేవా దాస్ కాస్త సేవా భాయిగా పేరు మారింది. కాలక్రమేణా అతని పేరు రూపాంతరం చెంది సేవా భాయగా పిలవబడుతున్నాడు.

సేవాభాయ తెల్లని వస్త్రాలు ధరించి, తలపై ఎర్రటి రుమాలు చుట్టుకునేవాడు. భుజంపైన పచ్చని కండువా వేసుకునేవాడు. చేతికి కొల్డా (వెండి కడియం) ధరించేవాడు. చేతిలో ఎప్పుడూ పొడగాటి కర్ర ఉండేది. ఆ రోజుల్లో బంజారాలు స్థిర నివాసం ఉండేవారు కాదు. అందులో భాగంగానే భీమ నాయక్ కుటుంబం గుత్తిమల్లారి నుండి చిత్రదుర్గ చేరి అక్కడి నుండి షిమోగాకు వెళ్లిపోయారు. సేవా భాయకు 12 సంవత్సరాల వయసు వచ్చేటప్పుడు మేరామ మాత తన విశ్వరూప దర్శనాన్ని సేవాభాయకు చూపించింది.

గుత్తిమల్లారి నుండి సేవాభాయా తిరుచాగడ్ (తిరుమల), శ్రీశైలం, ఒరిస్సాలోని కటక్ నది, సిరసా ఘడ్, సూర్ ఖండ్ మొదలైన ప్రదేశాలు తిరిగి తిరిగి మళ్ళీ తమ జన్మస్థానానికి వచ్చేవాడు. ఒకసారి సేవా భాయ నివసిస్తున్న ప్రాతంలో భయంకరమైన కరువు కారణంగా అనేక పశువుల చనిపోయాయి. చాలామంది ప్రజలు అనారోగ్యం పాలయ్యారు. మేరామ మాత సేవాభాయని తన భక్తుడుగా రమ్మంటే రాకపోవడం మూలంగానే మనకు ఇటువంటి ఆటంకాలు కలుగుతున్నాయని వారు నివసిస్తున్న తండాలో ఒక రకమైన విషప్రచారం మొదలైంది. అప్పటికే భారతదేశంలో బ్రిటిష్ వాళ్ళ ప్రభుత్వం నడుస్తూ వారు క్రైస్తవ మతాన్ని బలంగా అనేక ప్రాంతాల్లో స్థాపించుకుంటూ వస్తున్నారు.

చెప్పుడు మాటల మూలంగా నంగరి ప్రజలు సేవాభాయని గ్రామ బహిష్కరణ చేశారు. చివరిగా తన తల్లిదండ్రులను కలుసుకొని సేవాభాయ ఈ గ్రామం నుండి వెళ్లిపోతున్నానని చెప్పేసి ఇతర ప్రాంతాలకు బయలుదేరిపోతాడు.

ఇదే సమయంలో ముఖ్యగా భారతీయ లంబాడీలను ఇతర మతాల్లోకి బలవంతంగా మారుస్తున్నారు. అది క్రైస్తవం కావచ్చు, ఇస్లాం కావచ్చు ఇతర ఏ మతమైనా కావచ్చు. లంబాడా నాయకులు ఇది భరించలేక చాలా చితికిపోయారు. ఆ సమయంలో లంబాడ జాతి పెద్దలందరూ వేరే ప్రాంతంలో ఉన్న సేవాభాయతో సమావేశం అయ్యారు.

మహమ్మదీయులు ఈ దేశానికి వచ్చినప్పుడు లంబాడీలను తాము అనుసరిస్తున్నటువంటి హిందూ మతం నుండి ఇస్లాంలోకి మారడానికి ఒత్తిడి చేశారు. ఇప్పుడు బ్రిటిష్ వాళ్ళు వచ్చి క్రైస్తవ మతంలోకి మారమని ఒత్తిడి చేస్తున్నారు. దీని నుండి బయటపడే మార్గం ఎట్లా అని బంజారా సమాజం మొత్తం సేవాభాయతో మాట్లాడారు. అప్పుడు సేవాభాయ తన శిష్యులతోనూ, బంజారా నాయకులందరితోనూ తన నిర్ణయాన్ని తెలియజేస్తాడు. నేను జగదాంబ మాతకు భగత్ (పూజారి)గా ఉంటాను. అమ్మను శరణు వేడుతాను. జగదాంబ కోరిన విధంగానే పూజించి మేకలను బలి ఇచ్చుటకు నిశ్చయించుకున్నానని, మీరు కూడా మాతను పూజించండని తన శిష్యులతోటి అలాగే తండా నాయకులందరి చెప్తాడు. జగదాంబ మాతను శరణు కోరే వారిని రక్షిస్తుందని చెప్పి, సాతీ భవానీలను పూజిస్తూ సాతీ భవానీలకు స్వయంగా సేవాభాయ విగ్రహాలు చేయించి ఏడు మర్రి చెట్ల కింద ఉంచి ఆ విగ్రహాల ఎదురుగా లంబాడీల సంప్రదాయం ప్రకారం పూజలు చేస్తారు. సేవాభాయ కంచుపళ్లెం చేతబట్టి మ్రోగిస్తూ భవాని మాతకు సంబంధించిన పాటలు పాడుతూ హోమం కూడా చేస్తారు. అది చూసే జనాలకు ఆ సాంబ్రాణి ధూమం ఆకాశాన్ని తాకుతున్నట్లు అనిపిస్తుంది. ఆ పూజా కార్యక్రమాలకు చేస్తున్న సువాసనలకు అడవిలో ఉన్న జంతువులన్నీ సేవాభాయ దగ్గరికి చేరుకుంటాయి.

సేవాభాయ పూజలకు మెచ్చి మేరామ మాత ప్రత్యక్షమై ఏం వరం కావాలో అడగమని సేవాభాయని కోరుతుంది. అప్పుడు సేవాభాయ తల్లి మేరామ బంజారాలు ఆర్థికంగా కుంగిపోతున్నారు. మా సంస్కృతిలో ఇతరుల సంస్కృతి వచ్చి చేరుతున్నది. నేను ఏ మార్గం ద్వారా నడిచి మా సంస్కృతిని, మా ఆచారాలను, మా హిందూ సంప్రదాయాన్ని కాపాడుకోవాలో తెలియచేయమని కోరుతాడు. అప్పుడు మాత సేవాభాయను లంబాడీలు భారతదేశమంతటా సంచారం చేస్తూ నిలువ నీడలేక తిరుగుతున్నారు. వారి కొరకు తండాలను స్థాపించి, అటు గ్రామీణ సంస్కృతికి భిన్నంగా తండా సంస్కృతిని నిర్మించండని, అలాగే ప్రతి తండాలో ప్రతి ఇంట్లో నన్ను పూజించండని, ప్రతి తండాలో ధార్మిక కార్యక్రమాలు చేయమని అంటుంది. అప్పుడే మీ కష్టాలు అన్ని పోతాయని చెప్తుంది. ఒక శుభముహూర్తాన మేరామ మాత ఆశీర్వాదం పొందిన సేవాలాల్ మహారాజ్ గారి నాయకత్వంలో శిష్యగణం తయారవుతుంది. వీరు వేరువేరు తండాలు సందర్శించి సేవా దళాలను ఏర్పాటు చేసుకుంటారు. ఒకవైపు సేవాదళ్ తో పాటు మరోవైపు గోవులను దానం చేసుకుంటూ గోమాతను పూజిస్తూ భారతదేశం అంతటా పర్యటిస్తూ జగదాంబ మాత మతంను మాత బోధనలను, సూక్తులను, భక్తిని ప్రాచారం చేస్తుంటారు.

భారతదేశంలోని అన్ని తండాలలో సేవాభాయ బోధనలకు ఆకర్షితులై అనేక మంది శిష్యులు తయారైనారు. వీరు హిందూ సంస్కృతిని కాపాడుకుంటూ గోమాతను పూజించుకుంటూ భక్తిని ప్రాచారం చేసుకుంటూ ముందుకు వెళుతూఉంటారు.

సంత్ సేవాలాల్ మహారాజ్ భారతదేశం అంతటా పర్యటిస్తూ, లంబాడీలకు ఆధ్యాత్మిక పరమైన బోధనలతో జగదాంబ మాత చెప్పినట్లే ప్రతి తండాలో పూజాకార్యక్రమాలు చేస్తూ దేవత సందేశాన్ని ప్రజలకు వివరిస్తూ ఉంటాడు. అలాగే సేవాభాయ భారతదేశంలోని అనేక ప్రాంతాలలో, తండాలను, స్థాపిస్తూ లంబాడీలను చైతన్యవంతులుగా తయారుచేస్తాడు. ఆ సందర్భంలోనే నాందేడ్ ప్రాంతాన్ని సందర్శించి తెలంగాణ ప్రాంతంలోకి ప్రవేశించగానే తెలంగాణ ప్రాంతంలో ఉన్న నిజాం నవాబు సంత్ సేవాలాల్ మహారాజ్ గురించి తెలుసుకొని అతణ్ణి గౌరవిస్తాడు. రూయిఘడ్ లో సేవాలాల్ మహారాజ్ తన ప్రియ శిష్యులను పిలిచి, దేవాలయంలో వెయ్యి దీపాలు వెలిగించి, దేవాలయ ఆవరణంలో వేపచెట్టు ఆకులను పేర్చి అదే దేవాలయంలో సాతీ భవానీల విగ్రహాలను ప్రతిష్ఠించి లంబాడీ సమాజానికి హితబోధ చేసి, లంబాడీలు ఆధ్యాత్మిక భక్తి మార్గంలో ఎలా ముందుకు పోవాలో తెలియజేస్తూ తమకు కష్టనష్టాలు రాకుండా ఉండడం కోసం అందరూ కూడా శాకాహారులుగా మారండని హితోపదేశం చేసి తన 34వ ఏట దేహాన్ని వదిలేశాడు. సేవా, త్యాగం, సత్యానికి ప్రతీక సంత్ సేవాలల్ మహారాజ్. లంబాడాలను ఏకం చేసి ఆరాధ్యదైవంగా కొలువబతున్న ఆయన బోధనలు నేటి సమాజానికి స్ఫూర్తి దాయకం.

ఆచార్య భూక్య తిరుపతి
తెలుగుశాఖ,
హైదరాబాద్ విశ్వవిద్యాలయం
హైదరాబాద్ - 500046
సెల్: 9441335123



# తెలుగునేలపై శైవమత వ్యాప్తి

చారిత్రక యుగమున శాతవాహన, చాళుక్య, రాష్ట్రకూట, కాకతీయ, అనంతర కాలమున హైందవ సంస్కృతీ సభ్యతలకు ఆలవాలమైన తెలుగు నేలలో వివిధ రాజన్యుల ఏలుబడులలో శైవమతం పరిడవిల్లింది. క్రీ.పూ.2వ శతాబ్ది నాటికే తెలుగు నేలలో శైవారాధన ఉంది. గాథా సప్తశతిలో గౌరీ, పశుపతి స్తోత్ర ముంది. 1వ శతాబ్దంలో శైవంలో అత్యంత ప్రాచీనమైన పాశుపత శైవాన్ని లకులీస శివాచార్యుడు స్థాపించారు. చేతికందుతున్న చరిత్ర ఆధారంగా శ్రీముకుడు కాణ్వ రాజైన సుశర్మను వధించి, మగధను ఆక్రమించి, శాతవాహన రాజ్యాన్ని స్థాపించాడని, వివిధ చరిత్రకారుల అభిప్రాయాన్ని అనుసరించి, శ్రీ.పూ.1వ శతాబ్దిగా స్పష్టమవుతున్నది. శ్రీముకుడు జైన మతాన్ని స్వీకరించి, అనేక ఆలయాలను నిర్మించాడు. శాతవాహన 17వ రాజైన హాల చక్రవర్తి, సింహళ రాకుమారి లీలావతిని సప్త గోదావరీ తీరస్థ భీమేశ్వరాలయం, నేటి జగిత్యాల జిల్లాలోని వేంపెల్లి వెంకటరావుపేటలో వివాహ మాడినట్టు నాటి భీమేశ్వరాలయం ఉన్నట్లు నిరూపితమైంది. బౌద్ధమతంలోనూ నాగదేవత అరాధన ఉంది. స్థూపాలను పెనవేసుకున్న నాగ సర్పాల చిత్రాలు ప్రధానంగా ధూళికట్ట స్థూపంపై ఐదుతలల నాగ ముచిలింద శిల్పాన్ని చూడవచ్చు. ఇక్ష్వాకు (క్రీ.శ.253–277) రాజైన ఎహువల శాంతమూలుని సేనానియైన ఎలిశ్రీ ఏలేశ్వరం నిర్మించి, సర్వదేవాలయమనే శివాలయాన్ని నిర్మించాడు. ఆయన కాలంలో విజయపురిలో కార్తికేయ, పుష్పభద్ర స్వామి, నోడిగిరీశ్వర, దేవీ ఆలయాలు నిర్మితాలై నాయి. ఇక్ష్వాకుల కాలంలో మాతృ దేవతారాధన కూడా ఉండేది. నాగార్జున కొండలో హారీతి ఆలయం నిర్మించ బడింది.

ఆలయంలో సప్తమాతృకల వద్ద గాజులను సమర్పించే వారని శాసనాధారం. వీరికాలంలో స్కంద గణపతి, యక్షుడు, హారీతి దేవత లను పూజించేవారు. అనంతర వాకాట రాజులలో అధికులు శైవులు. మొదటి రుద్రసేనుడు మహా భైరవుని భక్తుడు కాగా, మొదటి పృధ్వీసేనుడు మహేశ్వర భక్తుడు. క్రీ.శ.358నుండి 569వరకు 210 ఏళ్ళు తెలంగాణను, ఉత్తరాంధ్రను పాలించిన విష్ణుకుండినులు నేటి మహబూబ్ నగర్ జిల్లాలోని అమ్రాబాద్ (అమల పురం), నల్గొండ జిల్లాలోని వలిగొండ మండలం లోని ఇంద్రపాల నగరం. కొంతకాలం బెజవాడను రాజధానిని చేసుకున్నారు. వీరు బ్రాహ్మణ మతావ లంబులు, శివభక్తులు. రెండవ మాధవవర్మ (క్రీ.శ.440–495) 100కుపైగా యుద్ధాలు చేసి, విజయాలు సాధించి, ఒక్కొక్క విజయానికి గుర్తుగా కీసర గుట్టపైన ఒక లింగ ప్రతిష్ఠ చేశాడు. విజయం సాధించిన చోటల్లా రామలింగేశ్వర ఆలయం కట్టించాడు. శ్రీశైలం మల్లికార్జునుని చంద్రగుప్తుడు అనే రాజు బంధువైన చంద్రవతి ప్రతిష్ఠించినదని చెపుతున్న గుప్త మహేశ్వర ఆలయ శిథిలాలు, నేటికీ శ్రీశైల ఉత్తర ద్వార క్షేత్రమైన ఉమా మహేశ్వరానికి ఉత్తరాన ప్రతాప రుద్ర కోటకింద వాయవ్య మూలన రోడుకు దక్షిణాన ఉన్నాయి. శ్రీశైల మల్లికార్జునుడు విష్ణుకుండినుల కాలంలోనే బహుళ ప్రచారం పొందాడు. గోవింద వర్మ అనేక దేవాలయాలు కట్టించాడు. 2వ మాధవ వర్మ అనేక రామ లింగేశ్వరాలయాలు కట్టించాడు. గుంటూరు జిల్లా లోని సత్తెనపల్లి తాలూకా వేల్పూరులో, ఈ ఊరులో, కీసరగుట్టలో రామలింగే శ్వరాలయాలు నేటికీ దర్శనీయ స్థలాలే. తూర్పు చాళుక్య 2వ విజయాదిత్యుడు 108 విజయాలకు గుర్తుగా 108 భీమేశ్వరాలయాలు నిర్మించాడు. జైన మతం విష్ణుకుండినుల కాలంలోనే దాదాపు కనుమరుగు కాగా, జైన ఆలయాలు శివాలయాలైనాయి. అలంపురం విష్ణుకుండినుల కన్నా ముందువారైన ఇక్ష్వాకుల నుంచే మనుగడలో ఉండేదని శాసనాధారంగా ఉంది. వేములవాడ చాళుక్యులు, వేములవాడలో నిర్మించిన రాజరాజేశ్వరాలయం తెలంగాణ లోని ప్రముఖ శివాలయం. బద్దెగ (క్రీ.శ.850–895) వేములవాడలో బద్దిగేశ్వర (భీమేశ్వర) ఆలయాన్ని నిర్మించాడు. క్రీ.శ.7వ శతాబ్ది శాసనంలో శివమండల దీక్ష ప్రసక్తి ఉంది. శ్రీశైలం, అలంపురం, బెజ



వాడ, పిఠాపురం నాటి శక్తి పూజా కేంద్రాలు.

బసవేశ్వరుడు (క్రీ.1100–70) వీర శైవోద్యమాన్ని ప్రారంభించాడు. అనంతరం మల్లికార్జున పండితుడు శైవాన్ని ప్రచారం చేశాడు. చాళుక్య భీముడు ద్రాక్షారామంలో భీమేశ్వరాలయం నిర్మించాడు. భీమవరం, పాలకొల్లు, అమరావతి ఆలయాలు చాళుక్య నిర్మాణాలే. యుద్ధ మల్లుడు బెజవాడలో కుమారస్వామి, 2వ విక్రమాదిత్యుని భార్య మహాదేవి, పట్టదకల్ లో శైవాలయాన్ని నిర్మించారు. రాష్ట్రకూటుల కాలంలో ఎల్లోరా గుహలు మలుచ బడ్డాయి. కైలాస నాథ ఏక శిలాలయం మొదటి కృష్ణుని అద్భుత సృష్టి. కాలాముఖ, కాపాలిక తెగలు ప్రచారం లోకి వచ్చాయి. కాకతీయులు కాకతి మాతృదేవతారాధకులుగా అభిప్రాయాలున్నాయి. గ్రామదేవత యైన ఏకవీర ఆరాధన నాడు బహుళ ప్రచారంలో ఉంది. వీరికాలంలో జైన బౌద్ధ, వీరశైవుల మధ్య ఘర్షణలు తారాస్థాయికి చేరాయి. ఇందుకు భిన్నంగానే తిక్కన హరిహర తత్వాన్ని బోధించాడు. కాళేశ్వరంలో శివలింగ ప్రతిష్ఠ చేసింది 2వ ప్రోలరాజు గురువైన రామేశ్వర పండితుడు. కాకతీయ పరిపాలనలో ధర్మపురి, అనుమకొండ, ఐనవోలు, పానగల్లు, నందికంది, శనిగరం, పుష్పగిరి, అమరావతి, సామర్లకోట, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం గొప్ప శైవక్షేత్రాలు. ఏకామ్రనాథుని ప్రతాపరుద్ర చరిత్రలో కాకతీయుల కాలంలో 5500 శైవాలయాలు, 1300 వైష్ణవాల యాలు, 2400 మల్లారదేవుని గుళ్ళు...భైరవ, దుర్గ గణపతి దేవుళ్ళవి కలిపి 4400 గుడులు ఉండేవని స్పష్టమవు తున్నది. వెలమరాజుల కాలంలో కాళిక, దుర్గ, చండి, భద్రకాళి, మహిశాసుర మర్ధిని, కట్టమైసమ్మ, ముత్యాలమ్మ, మారెమ్మ, ఏకవీర దేవతల ఆరాధన ఉన్నట్లు తెలుస్తున్నది.

రామ కిష్టయ్య సంగన భట్ల, 9440595494